అధ్వాన రోడ్లతో అవస్థలు



కోతకు గురైన గోకొండ రోడ్డు

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- గిరిజనులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

బజార్‌హత్నూర్: మండలంలో 30 గ్రామ పంచాయతీల పరిధిలో 64 గ్రామాలున్నాయి. ఇందులో 44 గ్రామాలకు మాత్రమే రోడ్డు సౌకర్యం ఉంది. మిగతా గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో కనీసం రోడ్డు సౌకర్యానికి నోచుకోలేదు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో పలు రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని గోకొండ, కొత్తగూడ, అందుగూడ, చింతకర్ర, రాంపూర్, సుంగుగూడ, సోనేరావ్‌గూడ, దిగ్నూర్, బోస్రా, టెంబి, కొలాంగూడ, కొలారి, భూతాయి, చందునాయక్ తండా, దేగామ, చింతలసాంగ్వి, మడగూడ, ఉప్పర్‌పల్లి, ఇంద్రనగర్ గ్రామాల సమీపంలో అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారాయి. అయినా.. మరమ్మతులు చేయించే నాయకుడే కరువయ్యాడు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే వచ్చే వర్షాకాలంలో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉంది.

రోడ్డు బాగు చేయాలి



మాగ్రామ సమీపంలో గత వర్షాకాలం భారీ వర్షాలకు బీటీ రోడ్డు కోతకు గురైంది. సగం రోడ్డు కొట్టుకుపోయింది. వాహనాలు మిగతా సగం రోడ్డుపై ప్రమాదకరంగా నడపాల్సి వస్తోంది. రాత్రి సమయంలో రోడ్డు దాటడం అంత సులువు కాదు. వర్షాకాలానికి మరో రెండు నెలల గడువు మాత్రమే ఉంది. నిర్లక్ష్యం చేస్తే మిగతా సగం రోడ్డు కొట్టుకపోతే గ్రామానికి రాకపోకలు బందువుతాయి.

– చెందేల్ చందర్‌సింగ్, గోకొండ

మరమ్మతులు చేస్తాం

మండలంలో గత వర్షాకాలంలో భారీ వర్షాలకు పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్ని రోడ్లు కోతకు గురయ్యాయి. మరమ్మతులు చేపట్టేందుకు ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డామేజ్ రెస్టోరేషన్) నిధుల కోసం ఉన్నతాధికారులకు విన్నవించాం. నిధులు మంజూరైతే కోతకు గురైన, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తాం.

– నర్సింగ్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

కాలినడకే శరణ్యం

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా ఐటీడీఏ ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలకు గిరిజన గ్రామాలు నోచుకోవడం లేదు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి గెలుపొందిన నాయకులు గెలిచిన తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో గిరిజనులకు కాలినడకే శరణ్యంగా మారింది. గాదిగూడ మండలంలోని పర్సువాడకు బీటీ రోడ్డు మంజూరు కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కునికాసా ఎస్సీగూడ, గోండుగూడ, కొలంగూడ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో కాలినడకనే ప్రయాణం సాగిస్తున్నారు. అత్యవసర సమయంలో 108, 102 వాహనాలు గ్రామాలకు రాలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పర్సువాడ నుంచి కునికాసా వెళ్లే రోడ్డు దుస్థితి

బేల మార్గంలోనే నేషనల్ హైవే



బేల శివాజీ చౌరస్తా

- ఇప్పుడున్న 100 ఫీట్ల పరిధిలో హైవే విస్తరణ
- చౌరస్తా, మలుపుల్లోనే భూసేకరణ
- మారనున్న రూపురేఖలు

బేల: మహారాష్ట్ర నుంచి బేల, జైనథ్‌ల మీదుగా భోరజ్ వరకు నిర్మించనున్న 353బీ నేషనల్ హైవే బేల మండల కేంద్రం మార్గంలోనే నిర్మించనున్నారు. ఏళ్ల నుంచి ఇప్పుడున్న రోడ్డు 100 ఫీట్ల పరిధిలోనే హైవే విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. బేలలో రోడ్డు మధ్యలో డివైడర్ రాకపోతే ప్రారంభం నుంచి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించనున్నారు. ఒకవేళ రోడ్డు మధ్యన డివైడర్ వస్తే, డివైడర్ రెండు వైపులా బీటీ రోడ్డు 9 మీటర్ల వరకు విస్తరించనున్నారు. కేవలం చౌరస్తా, మలుపుల్లోనే భూసేకరణ ఉంటుందని, ఆపై ఈ రోడ్డు 100ఫీట్ల పరిధిలోపు ఉన్న అన్ని అక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించనున్నట్లు నేషనల్ హైవే అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. మహారాష్ట్రలోని ఆష్టి (చంద్రపూర్) నుంచి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వరకు 353బీ హైవే మొత్తంగా 141 కిలోమీటర్లు ఉంటుంది. ఈ హైవే బేల, జైనథ్ మండలాల్లో 33 కిలోమీటర్ల మేర ఉంటుంది. రహదారి మంజూరైన ప్రారంభంలో మొత్తంగా ఫోర్‌లేన్‌గా నిర్మిస్తారని భావించారు. కానీ మహారాష్ట్రలో మాత్రమే ఫోర్‌లేన్‌గా నిర్మిస్తున్నారు. బేల, జైనథ్ మండలాల్లో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ప్యాసింబర్ కార్ యూనిట్ (పీసీయూ) సర్వే ప్రకారం డబుల్ లైన్‌కే పరిమితమైంది. ఒకవైపు ఈ పీసీయూ సర్వే డబుల్ లైన్‌తో, మరోవైపు బేల బైపాస్ బాధితుల ఆందోళనలతో బేలకు పక్కన మంజూరైన 4.15 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును రద్దు చేశారు. దీంతో హైవే నిర్మాణం బేల మార్గంలోనే చేపట్టనున్నట్లు గత నెల 13న నేషనల్ హైవే డీఈ, మండల తహసీల్దార్‌లు రైతుల నిరాహార దీక్ష వద్ద ప్రకటించారు.

సర్వీస్ రోడ్లు..

బేలలో 353బీ హైవే విస్తరణ పనుల్లో భాగంగా ఇప్పుడున్న 100 ఫీట్లలో 7 మీటర్ల వెడల్పుతో ఉన్న బీటీ రోడ్డు 10 మీటర్లకు పెరుగనుంది. రోడ్డు మధ్యలో డివైడర్ రాకపోతే ఇరువైపులా 5.5 మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్లతో అదనంగా పుట్‌పాత్ నిర్మాణం చేపట్టనున్నారు. డివైడర్ వస్తే రెండు వైపులా (ఫోర్‌లైన్) బీటీ రోడ్డు 9 మీటర్ల వరకు పేవుడ్ షోల్డర్ పద్ధతిలో విస్తరించనున్నారు. దీంతో పాటు డివైడర్ 1.50 మీటర్ల వరకు వెడల్పుతో నిర్మాణం చేపట్టనున్నారు.

మారనున్న రూపురేఖలు..

బేలలో హైవే విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు 100 ఫీట్ల పరిధిలో ఉన్న అన్ని అక్రమణలను రెవెన్యూ డివిజన్ అధికారి నోటీసులతో పూర్తిస్థాయిలో తొలగించనున్నారు. చౌరస్తా, మలుపుల్లో అవసరమైన భూ సేకరణ చేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా పాత విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేయనున్నారు. నీటి సరఫరా పైప్‌లైన్‌ను కొత్తది వేయనున్నారు. దీంతో పాటు ఇప్పుడున్న బీటీ రోడ్డుకు 6 ఇంచుల మేర ఎత్తు మరో రెండు లేయర్లతో బీటీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు హైవే అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో విస్తరణ పనులు

బేలలో 353బీ నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ నేషనల్ హైవేకు ఇచ్చే ప్లాన్ అండ్ ప్రొఫైల్ ప్రకారం రోడ్డు విస్తరణ పనులు జరుగనున్నాయి. విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పుడున్న రోడ్డు ఎత్తు మరో రెండు బీటీ లేయర్లతో ఐదారు ఇంచుల మేర పెరుగనుంది. విస్తరణ 100 ఫీట్ల రోడ్డు పరిధిలోనే ఉంటుంది. ఎటువంటి అండర్ బ్రిడ్జి ఉండదు. కేవలం చౌరస్తా, మలుపుల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా భూ సేకరణ ఉంటుంది. త్వరలో విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయి. – సుభాష్, డీఈ నేషనల్ హైవే

చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్, బీజేపీ నాయకులు లాలా మున్నా, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రయాణం.. ప్రమాదకరం



ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు మారుమూల గిరిజన గ్రామాల్లో పెళ్లిల సీజన్ జోరందుకుంది. దీంతో పెళ్లికి వచ్చిన బంధువులను లారీ, వ్యాన్‌లో ప్రమాదకరంగా తరలిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

శిశుమందిర్ పాఠశాలకు విరాళం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాలకు దాతలు రూ.60 వేలు విరాళం అందించి ఉదారత చాటుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీ సరస్వతి శిశు మందిర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బజరంగ్ అగర్వాల్ రూ.50 వేలు, మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ నిధులతో పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి అంకతి రవీందర్, పాఠశాల కార్యదర్శి మంగనాలే బాలాజీ, ఛాయా, గిత్తే భరత్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, శంభాజీ చాటే, రావణ్ ముండే, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండా రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దాతలు

శిక్షణ విజయవంతం చేయండి

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు నిర్వహించే శిక్షణను విజయవంతం చేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజులు హాజరు కానున్నట్లు తెలిపారు. లోకసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల ప్రచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలి, ఎన్నికల మేనేజ్‌మెంట్ జ్మెంట్ దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల మధ్యే 'మురుగు'

ఇచ్చోడ: మండల కేంద్రంలో సాయినగర్‌లో జనవాసాల మధ్య మురికి గుంత ఉండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లలో నుంచి వచ్చిన మురుగు ఒకచోట చేరడంతో దుర్గంధం వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: రంజాన్ పండుగను ప్రతిఒక్కరూ కలిసి మెలసి జరుపుకోవడం అభినందనీయమని ఖానాపూర్‌ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పాతబస్టాండ్‌లో సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ కరీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో కలీం మౌలానా, ఇబ్రాహీం, మహిమూద్, శ్రీరాంనాయక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ కమిటీ మాజీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో గంగ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: రంజాన్ పురస్కరించుకొని నిరుపేదలకు నిత్యవసర సరుకులను యువ నాయకులు అజ్మీర జయచంద్ర పంపిణీ చేశారు. పండుగను అందరూ కలిసి మెలిసి సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కలీంపాషా, అలీం, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న లోక ప్రవీణ్ రెడ్డి

తాంసి: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద హిందూ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ, హిందూ యువ సేన సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు సాయి, కార్తీక్, రాజు, మణి, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికొన్నత పాఠశాలలో బాలికలు 55 మంది కరాటేతో పాటు మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందుతున్నారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఇన్‌స్ట్రక్టర్ అశోక్ కరాటేతో పాటు మార్షల్ ఆర్ట్‌లో వివిధ మెళుకువలు నేర్పించారు. బాలికలకు, విద్యార్థినులకు ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించడంలో భాగంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం సంతోష్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ 70 రోజుల పాటు ఉండనున్నట్లు పేర్కొన్నారు.



కరాటే శిక్షణలో బాలికలు

జోరుగా ఇసుక దందా



ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

- పెన్‌గంగలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- కన్నెత్తి చూడని అధికారులు

తాంసి: జిల్లా సరిహద్దు గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగలో ఇసుక అక్రమ రవాణ జోరందుకుంది. కొందరు గ్రామస్తుల సహకారంతో మాఫియాగా ఏర్పడి ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి, అందిన కాడికి దండుకుంటున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరగుతున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

పలు గ్రామాల గుండా తరలింపు..

భీంపూర్ మండలంలోని తాంసి(కె), వడూర్, గుబిడి, అంతర్గాం గ్రామాల పరివాహక ప్రాంతాల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగ నుంచి నిత్యం ఇసుక తరలిపోతోంది. నిత్యం వందల ట్రాక్టర్లు, టిప్పర్ వాహనాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తోడేస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో వరదనీటితో పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేశాయి. ప్రజాప్రతినిధుల అండదండలతో ఇసుక రవాణ జరుగుతోంది.

కాసులు కురిపిస్తున్న దందా..

ఇసుక డిమాండ్ పెరగడంతో అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ఒకొక్క ట్రాక్టర్ ధర రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు పలుకుతోంది. ఇసుక అవసరం ఉన్న వారు ముందస్తుగా డబ్బులు చెల్లించి బుకింగ్ చేసుకుంటున్నారు. బుక్ చేసుకున్న వారికి రాత్రి రాత్రే ట్రాక్టర్‌ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వీడీసీల పేరిట ఇసుక తవ్వకాల కోసం వేలం పాట నిర్వహిస్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక తవ్వకాలు చేపడితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. ఇసుకను అక్రమ రవాణా జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. స్థానికులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తాం.

– సత్యనారాయణరావు, భీంపూర్ తహసీల్దార్

కాంగ్రెస్‌లో చేరిక

నార్నూర్: మంత్రి సీతక్క సమక్షంలో నార్నూర్ 1 ఎంపీటీసీ పరమేశ్వర్, బీఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్ మాహుర్కర్, నాయకులు శంకర్ మాస్కె, జుజైత్ ఖాన్‌లు ఆదివారం కాంగ్రెస్ చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యకర్తగా కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన లంబాడా జేఏసీ నాయకులు



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో నాయకులు

నార్నూర్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను లంబాడా జేఏసీ నాయకులు ఆయన స్వగృహంలో మార్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. జేఏసీ నాయకులు జాదవ్ శ్రీరాంనాయక్, జాదవ్ రెడ్డినాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్‌లు కలిసి, గిరిజనుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఎంపీ టికెట్ విషయంలో లంబాడాలకు జరిగిన అన్యాయంపై చర్చించినట్లు పేర్కొన్నారు. నారాయణ్, దిలీప్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

ముగిసిన సప్తాహం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జైనథ్: మండలంలోని కరంజి గ్రామంలో బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలు ఆదివారం ముగిశాయి. బాబా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, గీతాపారాయణం, హరిపాట్ గావించారు. అనంతరం బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ముందుకుసాగగా.. భక్తులు భజనలు, కీర్తనలు నిర్వహించారు.

అంబేద్కర్ జయంతి విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి: అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. ఈ నెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దళిత, బహుజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తమ్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు కామ్‌రాజ్ వాగ్మారే, సునీల్, శివాజీ, నాగ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌కు వచ్చే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

ఇంద్రవెల్లి: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై దుబ్బక సునీల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి నెంబర్ ప్లేట్ లేని, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనానికి నెంబర్ ప్లేట్‌తో పాటు వాహన పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు లక్ష్మణ్, కాత్లే భీంరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఓటరు అవగాహన ర్యాలీ

ఎదులాపురం: స్వీప్ ప్రచారంలో భాగంగా ఈనెల 8న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఛాంబర్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ నుంచి ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని వ్యాపార, వాణిజ్య, వర్తక సంఘాల ప్రతినిధులతో కలిసి నిర్వహించే ర్యాలీని కలెక్టర్ రాజర్షి షా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎదులాపురం: ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

అడవిలో అగ్నిప్రమాదం

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ సమీపంలోని అడవిలో ఆదివారం రాత్రి అగ్గి రాజుకుంది. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.